7

సాక్షి మంచిర్యాల

బుధవారం ၊ 29 ၊ జనవరి ၊ 2025



మహాపూజకు బయలుదేరిన మెస్రం వంశీయులు



హారతి తీసుకుంటున్న కలెక్టర్, పీవో, ఎమ్మెల్యేలు

న్యూస్‌రీల్

సాగు చట్టాలపై రైతులకు అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అర్పిత మారంరెడ్డి

కాసిపేట: సాగు చట్టాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారం రెడ్డి అన్నారు. మంగళవారం ముత్యంపల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతు చట్టాలు, సాగు చట్టాలు, భూమి హక్కులు, విత్తన చట్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మెంబర్ ఆర్ఆర్.రాములు, సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రాజా నరేందర్, మండల వ్యవసాయాధికారి సీహెచ్.ప్రభాకర్, ఏఈవోలు రమ్య, సంధ్యారాణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ)కి చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలోని కేజీబీవీలో అండర్-14 విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలు నిర్వహించగా సీవోఈకి చెందిన ఎ.హర్షవర్ధన్, డి.విశ్వతేజ, బి.వర్షిత్, డి.ఆసిత్, ఎస్.సంకిత్‌సాయి, బి.రిషేంద్ర వర్మ, ఎస్.రుషికేష్ ప్రతిభ కనబర్చారు. ఈనెల 29 నుంచి 31 వరకు మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం సీవోఈ ప్రిన్సిపాల్ దూట శ్రీధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

బీసీల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలి

పాతమంచిర్యాల: ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయింపునకు ప్రతిపాదించాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ బడ్జెట్ సమావేశాల్లో రూ.35 లక్షల కోట్ల నుంచి రూ.40 లక్షల కోట్లకు ప్రతిపాదనలు చేస్తే బీసీలకు కేటాయించేది కేవలం 15 నుంచి 16 కోట్లు మాత్రమేనన్నారు. 85 కోట్ల జనాభా ఉన్న బీసీలకు కేటాయించే ఈ బడ్జెట్ దేనికీ సరిపోదన్నారు. బీసీల జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలన్నారు.



కాలికోమ్ వాయిస్తున్న మెస్రం వంశీయుడు



మహాపూజ నిర్వహిస్తున్న మెస్రం వంశీయులు



మహాపూజకు హాజరైన కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఎమ్మెల్యేలు బొజ్జు పటేల్, అనిల్‌జాదవ్ తదితరులు..

జై నాగోబా

- మహాపూజతో జాతర షురూ
- ఆకట్టుకున్న 'మెస్రం' సంప్రదాయ పూజలు
- హాజరైన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు
- భక్తజన సందడిగా కేస్లాపూర్

నాగోబా.. వారి ఆరాధ్యదైవం. ఆచార, సంప్రదాయాలంటే ప్రాణం. నిండు మనసుతో ప్రత్యేక పూజలు చేసి కొలుస్తారు. పౌర్ణమికి శ్రీకారం చుట్టి అమావాస్యకి కీలక ఘట్టానికి చేరువవుతారు. తెల్లని వస్త్రాలతో స్వచ్ఛతకు ప్రతీకగా నిలుస్తారు. పవిత్ర గంగాజలం కోసం మైళ్ల దూరం సైతం లెక్కచేయరు. సామూహిక పాదయాత్రతో ముందడుగు వేస్తారు. ఆరాధ్య దైవాన్ని అభిషేకించి గిరిజన జాతరకు శ్రీకారం చుడుతారు. ఆడపడుచులు, అల్లుళ్లకు పెద్దపీట వేస్తూ ఆనవాయితీ తప్పని ఆ గిరిపుత్రులే మెస్రం వంశీయులు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా తమ ఇలవేల్పును ఆరాధించారు. మహాపూజకు శ్రీకారం చుట్టారు. కేస్లాపూర్‌ను భక్తజన సందడిగా మార్చారు. – ఇంద్రవెల్లి

రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నాగోబా జాతర మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆదివాసీ సంస్కృతి అద్దం పట్టేలా మెస్రం వంశీయులు సంప్రదాయ పూజలు నిర్వహించారు. ఉదయం కేస్లాపూర్‌లోని మురాడి నుంచి నాగోబా విగ్రహం, పూజ సామగ్రితో బయలుదేరారు. డోలు, తుడం, కాలీకోమ్, పెప్రే వాయిస్తూ పవిత్ర గంగాజలంతో నాగోబా ఆలయానికి చేరుకున్నారు. ముందుగా మైసమ్మ దేవతకు పూజలు చేసి ఆలయంలోనికి ప్రవేశించారు. నాగోబా దర్శనం అనంతరం సంప్రదాయ పూజలు షురూ చేశారు. 22 కితల వారీగా మహిళలు, ఆడపడుచులు వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుని కుండలు అందుకున్నారు. అనంతరం వంశ అల్లుళ్లు, ఆడపడుచులు కొత్త కుండలతో మర్రిచెట్టు వద్ద ఉన్న కోనేరుకు చేరుకున్నారు. అక్కడి నుంచి సేకరించిన నీటితో ఆలయానికి వచ్చారు. పర్ధాన్ కితకు చెందిన వారు సంప్రదాయ వాయిద్యాలు వాయించగా ఆలయం పక్కన గల పాత మట్టి పుట్టలను అల్లుళ్లు తవ్వారు. ఆ మట్టితో ఆడపడుచులు తిరిగి కొత్త పుట్టలు తయారు చేశారు. సతీదేవత ఆలయం ఎదుట ఏడు వరుసలతో బౌలను తీర్చిదిద్దారు. దానిని గర్భగుడిలో పొందుపరిచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది.

మహాపూజ

సంప్రదాయ పూజల అనంతరం రాత్రి 9 నుంచి 11 గంటల వరకు పాదయాత్ర ద్వారా తీసుకొచ్చిన పవిత్ర గంగాజలంతో ఆలయాన్ని శుద్ధి చేశారు. నాగోబాను అభిషేకించి మహాపూజ తంతు నిర్వహించారు (ఈ సమయంలో మెస్రం వంశీయులు మినహా ఇతరులకు అనుమతి ఉండదు). జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పూజలు చేసి మొక్కులు షురూ చేశారు. జాతర ప్రారంభమైనట్లు వంశపెద్దలు ప్రకటించారు. కార్యక్రమంలో మెస్రం పటేల్ వెంకట్‌రావ్, కటోడ మెస్రం కోసు, వంశ పెద్దలు కోసేరావ్, బాదిరావ్, లింబారావ్, దాదారావ్, తిరుపతి, వంశ ఉద్యోగులు మనోహర్, దేవ్‌రావ్, సోనేరావ్, శేఖర్‌బాబు తదితరులున్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏఎస్పీ

గట్టి బందోబస్తు

ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ ఆధ్వర్యంలో ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 25 మంది ఎస్సైలు, సుమారు 600 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 4 వరకు బందోబస్తు కొనసాగుతుందని ఏఎస్పీ తెలిపారు. అనంతరం ఆమె భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఏఎస్పీ వెంట ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ గౌడ్, సీఐ మొగిలి, స్థానిక ఎస్సై సునిల్, ఆలయ పీఠాధిపతి వెంకట్ రావ్, మెస్రం వంశ పెద్దలు చిన్ను తదితరులున్నారు.

పాము ప్రత్యక్షం..



ప్రధాన గేటు వద్ద కనిపించిన పాము

వంశీయులు సంప్రదాయ వాయిద్యాలతో ఆలయానికి వస్తున్న క్రమంలో ప్రధాన గేటు వద్ద ఓ పాము ప్రత్యక్షమయింది. అందరూ ఆసక్తిగా తిలకించి మొక్కుకున్నారు. సెల్‌ఫోన్లలో బంధించారు.

భేటింగ్

అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజాము 3గంటల వరకు భేటింగ్ నిర్వహించారు. వంశంలోని కొత్త కోడళ్లు సుమారు వంద మందికి పైగా ఇందులో పాల్గొన్నారు. సతీదేవత, నాగోబా ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం వారు పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంతో వారు పూర్తిగా మెస్రం వంశంలో చేరినట్లుగా భావిస్తారు.

తరలివచ్చిన భక్తులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి మెస్రం వంశీయులు, భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అలాగే ఆర్టీసీ స్పెషల్ బస్సులను నడిపింది.



గంగాజలాన్ని ఆలయ ప్రదేశంలో కడుతున్న మెస్రం వంశీయులు



కోనేరు వద్ద నీటిని కుండల్లో నింపుతున్న మెస్రం అల్లుళ్లు



కోనేరు నుంచి నీటిని తీసుకొస్తున్న మెస్రం అల్లుళ్లు, ఆడపడుచులు



చరిత్రను బోధిస్తున్న ప్రధాన్ కితకు చెందిన వంశీయులు

అంతరిక్ష, రక్షణ రంగంలో దేశాభివృద్ధి

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలఅర్బన్: అంతరిక్ష, రక్షణ రంగంలో భారతదేశం అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఉషోదయ పాఠశాలలో ఇస్రో, డీఆర్‌డీవో సహకారంతో సాంకేతిక ప్రదర్శన స్పేస్ డిఫెన్స్ ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ రక్షణకు అవసరమయ్యే మిస్సైల్స్ శాటిలైట్లను, రాకెట్లను స్వదేశీ పరిజ్ఞానంతో పనిచేయించడం దేశానికి గర్వకారణమన్నారు. శక్తి మిస్సైల్‌ను తయారు చేయడంలో అత్యంత కీలకమైన సతీశ్‌రెడ్డి మంచిర్యాలకు వచ్చి విద్యార్థులకు దేశ రక్షణపై అవగాహన కల్పించడం హర్షనీయమన్నారు. భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, భారత రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ కనీస వసతులులేని మారుమూల ప్రాంతం నుంచి డీఆర్‌డీవో చైర్మన్‌గా ఎదగడం వెనుక ఉపాధ్యాయుల కృషి ఉందన్నారు. తన జీవితంలో అబ్దుల్ కలాంతో కలిసి పనిచేయడం ఒక అద్భుత ఘట్టమన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత కూడా భారత రక్షణ రంగానికి అడ్వైజర్‌గా పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నానన్నారు. అనంతరం వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

అలరించిన ఇన్‌స్పైర్ ఇండియా, సాంకేతిక ప్రదర్శన

కేఐవైఈ ఫౌండేషన్, ఇస్రో డీఆర్‌డీవో సహకారంతో ఏర్పాటు చేసిన ఇన్‌స్పైర్ ఇండియా, సాంకేతిక రక్షణ రంగం ప్రదర్శనలను ముఖ్యఅతిథులు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి, కలెక్టర్ కుమార్‌దీపక్ ప్రారంభించగా విద్యార్థులు తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం అబ్దుల్ కలాం జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, ఇస్రో సైంటిస్టు శివశంకర్, డీఎస్‌వో మధుబాబు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శేఖర్‌రావు, కార్యక్రమ నిర్వాహకుడు బాలాజీ, ట్రస్మా బాధ్యులు విష్ణువర్ధన్‌రావు, రమణ, చంద్రమోహన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉన్నతి’తో ఉపాధి

- ఉపాధి కూలీల పిల్లలకు శిక్షణ
- స్వయం ఉపాధి ఎంచుకునే అవకాశం
- 2018 నుంచి 2024 వరకు 491 మందికి ట్రైనింగ్

పాతమంచిర్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకునే అవకాశం కల్పించింది. ఉపాధి హామీలో కేవలం మట్టి పనులే కాకుండా స్వయంకృషితో ఆసక్తి ఉన్న పనులు నేర్చుకుని తమకాళ్లపై తాము నిలబడే అవకాశాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ కల్పిస్తోంది. ఇందు కోసం ఉన్నతి అనే కార్యక్రమం ద్వారా మహిళలు, పురుషులకు వేర్వేరుగా నెలరోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. 26 రోజుల శిక్షణ కాలంలో రోజుకు రూ.300 భత్యం చెల్లించనున్నారు. అంతేకాకుండా శిక్షణ అనంతరం బ్యాంకు నుంచి రుణం కూడా అందిస్తున్నారు.

శిక్షణ కేంద్రాలు

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, జగిత్యాల, ఆర్ఎస్ఈటీఐ (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఉట్నూర్, సిరిసిల్లలోని డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉట్నూర్‌లోని ఆర్ఎస్ఈటీఐలో బైక్ మెకానిక్, జగిత్యాలలో న్యాక్ ద్వారా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌పై, సిరిసిల్లలో డ్రైవింగ్‌పై, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో పంటల సంరక్షణ, అధిక దిగుబడులపై శిక్షణ ఇప్పిస్తున్నారు. 2025 సంవత్సరానికి సంబంధించి ఔత్సాహికులను ఈ ఏడాది మార్చి నాటికి స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమానికి ఎంపిక చేయనున్నట్లు ఉన్నతి కోర్సు డైరెక్టర్లు సదానందం, సురేష్ తెలిపారు. జ్యూట్‌బ్యాగుల తయారీ, మగ్గం వర్క్‌కోసం 100 మందిని, కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ పంట దిగుబడులు, పాడిపరిశ్రమ అభివృద్ధిపై శిక్షణకోసం 100 మందిని ఎంపిక చేశామన్నారు. శిక్షణ పొందేందుకు ఆసక్తి కలవారు మండల కేంద్రాల్లో ఉపాధి హామీ అధికారుల వద్ద, గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు. 2018 నుంచి 2024 వరకు 491 మంది ఉన్నతి శిక్షణ పొందినట్లు వారు పేర్కొన్నారు.



జ్యూట్ బ్యాగ్‌ల తయారీపై శిక్షణ పొందుతున్న మహిళలు (ఫైల్)

కార్యక్రమం ముఖ్య ఉద్దేశం

ఉపాధిహామీలో వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల్లో చదువుకున్న నిరుద్యోగులను గుర్తించి వారికి మంచి భవిష్యత్ కల్పించాలనేదే ఉన్నతి కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. జిల్లాలోని ఉపాధి హామీ కూలీల కుటుంబసభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామాల్లో అవగాహ న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వందరోజుల పనిదినాలు పూర్తి చేసిన వారు దాదాపు 64 వేల మంది ఉన్నట్లు అంచనా. 18 సంవత్సరాల నుంచి 40 ఏళ్ల లోపు ఉన్నవారు ఉన్నతి శిక్షణకు అర్హులు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వారికి మాత్రమే డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకంలో వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీల కుటుంబాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. ఉన్నతి ద్వారా అందిస్తున్న శిక్షణలో నైపుణ్యత పొందాలి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాంకుల ద్వారా రుణం ఇచ్చేందుకు సహకారం అందిస్తాం.

– ఎస్.కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థుల భవిష్యత్‌పై మాదక ద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నియంత్రణ, రహదారి భద్రత అంశాలపై డీసీపీ భాస్కర్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నందగోపాల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాలను నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా బుధవారం పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. 2024లో 63 మాదక ద్రవ్యాల కేసులు నమోదు కాగా 167 మంది, 2023లో 53 కేసుల్లో 82 మంది అరెస్టు అయ్యారన్నారు. 35 మందిని డ్రగ్ డి-అడిక్షన్ కేంద్రాలకు పంపించామన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే 100కు సమాచారం అందించాలన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 29 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో డీసీపీ ఏ.భాస్కర్, అదనపు కలెక్టర్ మోతీలాల్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 22 వరకు నిర్వహించనున్న పరీక్షలకు 39 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్, ఇన్విజిలేటర్ల నియామకం, నిరంతర విద్యుత్ సరఫరా, ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి యాదయ్య, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, మైనార్టీ సంక్షేమాధికారి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఇక నగర పాలన

- మున్సిపల్ కార్పొరేషన్‌గా మంచిర్యాల
- జీవో విడుదల చేసిన సీడీఎంఏ కమిషనర్ డాక్టర్ టీకే.శ్రీదేవి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ సీడీఎంఏ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ టీకే.శ్రీదేవి మంగళవారం జీవో విడుదల చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీలో నస్పూరు మున్సిపాలిటీతోపాటు హాజీపూర్ మండలంలోని పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూరు, చందనాపూర్, ముల్కల్ల, కొత్తపల్లి, వేంపల్లి జీపీలను కలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. వీటికి సంబంధించిన రికార్డులన్నీ వెంటనే మంచిర్యాల మున్సిపాలిటీకి అప్పగించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. జీపీల్లోని రశీదులు, రికార్డులు, మినట్స్ బుక్‌లను సీజ్ చేయడంతోపాటు, ఇప్పటికే ఉన్న బ్యాంక్ అకౌంట్ల స్థానంలో కొత్త బ్యాంక్ అకౌంట్ 'ది మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్' పేరిట ఏదైనా నేషనలైజ్డ్ బ్యాంకులో తీసుకోవాలని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. పూర్తి రికార్డుల తోపాటు, అందుకు సంబంధించిన రిపోర్టును ఫిబ్రవరి 6లోగా మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ తీసుకోవాలన్నారు. మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 26తో ముగియగా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్నారు.

క్లుప్తంగా

'ఖందేవ్' హుండీ లెక్కింపు



లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నార్నూర్: తొడసం వంశీయుల ఆరాధ్య దైవం ఖందేవ్ జాతర ముగిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హుండీని లెక్కించారు. తైబజార్ వేలం ద్వారా రూ.1,41,400, హుండీ ద్వారా రూ.80,401 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ తొడసం నాగోరావు తెలిపారు.

ఎద్దుల చోరీకి యత్నించిన ముగ్గురిపై కేసు

రెబ్బెన: ఇంటి ఆవరణలో కట్టేసిన ఎద్దులను అర్ధరాత్రి చోరీకి యత్నించిన ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గంగాపూర్‌కు చెందిన జిల్ల వెంకటేశ్, సోగాల ప్రశాంత్, నంబాల గ్రామానికి చెందిన గోలెం మల్లేశ్, సోమవారం అర్ధరాత్రి సమయంలో బోలేరో వాహనంలో పుంజుమేరగూడకు వెళ్లారు. గుర్లె సంతోష్ ఇంటి ఆవరణలో కట్టేసిన ఎద్దును అపహరించేందుకు యత్నించారు. శబ్దం రావడంతో సంతోష్ బయటకు వచ్చి చూడగా ఎద్దును తీసుకెళ్తుండగా అడ్డగించాడు. వారి వద్ద నుంచి ఎద్దును తీసుకున్నాడు. విషయం తెలియడంతో గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి నిందితులను అప్పగించారు. గతేడాది దేవులగూడలో రెండు గెదేలు కనిపించకుండా పోయినట్లు బాధితులు స్టేషన్‌లో ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు గుర్లె సంతోష్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ఆర్పీఎల్‌లో మంగళవారం ఇద్దరు కార్మికులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ కథనం ప్రకారం.. పాఠశాల భవనానికి రంగులు వేయడానికి ఇమ్రాన్ కాంట్రాక్ట్ తీసుకున్నాడు. బిహార్‌కు చెందిన కుమ్రు హుడా, మహ్మద్ ఇసాఖ్‌లు రంగులు వేసే క్రమంలో నిచ్చెనను గోడకు వేశారు. పైన చూసుకోకపోవడంతో విద్యుత్ తీగలు తాకడంతో ఇద్దరు షాక్‌కు గురయ్యారు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. కాంట్రాక్టర్‌పై బాధితుల బంధువుడు నికుల్ హుడా ఫిర్యాదు చేయగా,కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తికి జరిమానా

లక్సెట్టిపేట: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తికి మంగళవారం జరిమానా విధించినట్లు విద్యుత్ శాఖ ఏఈ గణేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధి ఊత్కూరులో అమృత్ 2.0 పథకంలో భాగంగా వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు వెంక్రటాపేటకు చెందిన సబ్ కాంట్రాక్టర్ సత్తయ్య విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నాడు. సమాచారం అందుకున్న విజిలెన్సు అధికారులు అతనిపై కేసు నమోదు చేసి రూ.11 వేల జరిమానా విధించినట్లు విద్యుత్ శాఖ ఏఈ గణేశ్ పేర్కొన్నారు.

ఆర్టీసీలో సమ్మె సైరన్!

- 9 నుంచి చేపట్టేందుకు నిర్ణయం
- యాజమాన్యానికి కార్మికుల జేఏసీ నోటీసులు
- సమ్మెతో ప్రజారవాణా సంస్థపై భారం పడే అవకాశం

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో..

డిపో	ఉద్యోగులు
ఆదిలాబాద్	440
భైంసా	268
నిర్మల్	468
ఉట్నూర్	120
ఆసిఫాబాద్	321
మంచిర్యాల	516
ఆర్ఎంఓ	52
మొత్తం	2185



టికెట్ ఇస్తున్న కండక్టర్ (ఫైల్)

ఆదిలాబాద్: ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగనుంది. ఫిబ్రవరి 9 నుంచి సమ్మె చేయాలని ఆర్టీసీ కార్మికుల జేఏసీ నిర్ణయించింది. యాజమాన్యానికి సమ్మె నోటీసులు అందజేసింది. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉద్యోగులు, కార్మికులు నిరసన బాట పట్టనున్నారు. ఈనేపథ్యంలో ప్రజారవాణా సంస్థపై భారం పడనుంది. మహాలక్ష్మిపథకం ద్వారా మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై తీవ్ర ప్రభావం పడనుంది.

ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ప్రైవేట్‌కు..

సంస్థపై పడుతున్న డీజిల్ భారం తగ్గించుకునేందుకు ఎలక్ట్రిక్ బస్సులు తీసుకువచ్చింది. ప్రైవేట్ సంస్థతో ఒప్పందం చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రధాన డిపోల్లో వీటి సర్వీసులు ప్రారంభించింది. వీటి నిర్వహణ బాధ్యతలను సదరు సంస్థకు అప్పగించడం, పలు డిపోలను సైతం ప్రైవేటు కంపెనీకే అప్పగించనుండడం ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన మొదలైంది. పరోక్షంగా తమ అవసరం తగ్గిపోతుండడం, నూతన నియామకాల విషయంలో సంస్థ మీనామేలు లెక్కిస్తుండడం వారిలో ఆందోళన మొదలైంది. యాజమాన్యం ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోందని, తమ ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంతో సమ్మెకు దిగుతామని సంస్థకు నోటీసులు అందించారు. కార్మికులకు ఎన్నో సమస్యలు ఉన్నా, వారు పలు డిమాండ్లు చేస్తున్నప్పటికీ, ఎలక్ట్రిక్ బస్సుల వ్యవహారమే కారణమే ఉద్యోగుల్లో జోరుగా చర్చ సాగుతోంది.

సమ్మెకు దిగితే నష్టం..

ఉద్యోగులు సమ్మెకు దిగితే సంస్థకు నష్టంతోపాటు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవు. అయితే ప్రభుత్వం కార్మికుల డిమాండ్లు నెరవేర్చకుండా సమ్మె అనివార్యమైతే అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అదేసమయంలో సంస్థ ఆదాయంపై ప్రభావం పడుతుంది. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన ఆర్టీసీకి సమ్మె శరాఘాతమే అవుతుంది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ప్రతీరోజు లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. రూ.కోట్లలో సంస్థకు ఆదాయం సమకూరుతుంది. సమ్మెతో సంస్థకు భవిష్యత్తులో నిర్వహణ కష్టాలు సైతం తలెత్తే అవకాశం లేకపోలేదు.

సమ్మెతో చార్జీల పెంపు!

తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు 2019లో 52 రోజులపాటు నిరువధిక సమ్మె చేశారు. దీంతో సంస్థ పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయింది. సమ్మె సమయంలో తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతో నెట్టుకొచ్చిన ఆర్టీసీ ఎంతో ఆదాయాన్ని కోల్పోయింది. సమ్మె ముగిసిన తర్వాత నష్టాలను సాకుగా చెబుతూ యాజమాన్యం టికెట్ రేట్లు పెంచింది. ఈసారి సమ్మె చేపడితే భవిష్యత్తులో ప్రయాణికులపై అదనపు చార్జీల భారం తప్పకుండా పడుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి.
- ప్రస్తుత సౌకర్యాలు కొనసాగిస్తూ, ప్రభుత్వంలో విలీనం చేయాలి.
- 2021 వేతన సవరణ అమలు చేస్తూ, ప్రభుత్వోద్యోగులతో సమానంగా వేతనాలు అమలు చేయాలి.
- 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించి, రిటైర్డ్ ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయాలి.
- కొత్త బస్సుల కొనుగోలు ద్వారా ఆర్టీసీని అభివృద్ధి చేసి, ఆధునీకికరించాలి.
- సంస్థ అప్పులను ప్రభుత్వమే టేకోవర్ చేసి, రాయితీలకు, సంస్థ అభివృద్ధికి ఏటా బడ్జెట్‌లో 3% కేటాయించాలి.
- విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి, సంస్థకు ఇవ్వాలి.
- సీసీఎస్, ఎస్ఆర్బీఎస్, పీఎఫ్ నిధులు వెంటనే విడుదల చేయాలి. సీసీఎస్‌లో ఎన్నికలు నిర్వహించి, ఖాళీలు భర్తీ చేయాలి.
- మహాలక్ష్మి పథకంలో జీరో టికెట్ బదులు మహిళలకు స్మార్ట్‌కార్డు ఇవ్వాలి. రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలి

ఆర్టీసీలో యూనియన్లు లేవు



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో సమ్మెకు సంబంధించి ఎలాంటి నోటీసు అందలేదు. ప్రస్తుత ఆర్టీసీలో వెల్ఫేర్ బోర్డు మెంబర్స్ మాత్రమే ఉన్నారు. ఎలాంటి యూనియన్లు లేవు.

– సోలోమన్, ఆర్టీసీ ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్

కలప స్వాధీనం



స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

సారంగపూర్: మండలంలోని మహవీర్‌తండాలో జాదవ్ బలిరాం ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 13 కలప దుంగలను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని సారంగపూర్ డీఆర్వో నజీర్‌ఖాన్ తెలిపారు. పక్కా సమాచారంతో ఎఫ్ఆర్వో రామకృష్ణారావు, సిబ్బందితో కలిసి గ్రామంలో దాడులు నిర్వహించారు. జాదవ్ బలరాం తన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 13 కలపను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.9వేలు ఉంటుందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. నిర్మల్ డీఆర్వో సంతోష్, ఎఫ్‌బీవోలు సుజాత, ప్రవంతి, తదితరులు ఉన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు బైండోవర్

జన్నారం: వేర్వేరు ఘటనల్లో ముగ్గురిని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఎదుట మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎఫ్ఆర్వో సుష్మారావు తెలిపారు. జన్నారం బీట్‌లో అక్రమంగా అటవీ భూమిలో సాగు చేస్తున్న కబీర్‌ఖాన్, గోండుగూడ బీట్‌లో వన్యప్రాణుల కోసం ఉచ్చులు పెట్టిన మాదాసు మల్లేశ్, పోచ్చల శ్రీనివాస్‌పై కేసులు నమోదు చేసి బైండోవర్ చేశామన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలకు పాల్పడితే జైలుశిక్ష లేదా జరిమానా విధిస్తామన్నారు. డీఆర్వో తిరుపతి, బీట్ అధికారులు లాల్‌బాయి, శ్రీనివాస్ ఉన్నారు.

పోలీసుల క్రీడలు



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న కాళేశ్వరం జోన్ జట్టు



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న బాసర జోన్ జట్టు

కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం రాష్ట్ర స్థాయి పోలీసుల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రారంభం అయ్యాయి. కాళేశ్వరం జోన్, బాసర జోన్ జట్లు మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నాయి.

పర్మిట్ కర్రతో పనులు చేసుకోవాలి

కాసిపేట: వడ్రంగులు పర్మిట్ కర్రతో మాత్రమే పనులు చేసుకోవాలని ముత్యంపల్లి సెక్షన్ డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ సూచించారు. మండలంలోని ముత్యంపల్లి సెక్షన్ కొండపూర్, ముత్యంపల్లి, ధర్మరావుపేట సెక్షన్ పరిధిలోని వడ్రంగులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా పర్మిట్ లేని కర్ర గుర్తించినట్లయితే యంత్రంతోపాటు కర్ర సీజ్ చేసి జరిమానా విధిస్తామన్నారు. ఇటీవల ధర్మరావుపేట సెక్షన్ పరిధిలో పర్మిట్ లేని కర్ర వాడిన వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. బీట్ ఆఫీసర్లు కుమారస్వామి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



వడ్రంగులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌నాయక్

మంచినీటి బావిలో వేడినీళ్లు!

దండేపల్లి: సాధారణంగా మంచినీటి బావిలో నీళ్లు చల్లగా ఉంటాయి. దండేపల్లి మండలం మాదాపూర్‌కు చెందిన ఆవునూరి మధుకర్ ఇంటి ఆవరణలో మంచినీటి బావిలో ఐదురోజులుగా నీళ్లు వేడిగా ఉంటుంది. బావిలో మోటారు ఉన్నందుకేమోనని మంగళవారం కనెక్షన్ తొలగించాడు. మళ్లీ కొన్ని గంటల తర్వాత బావి నీళ్లు తోడి పరిశీలిస్తే వేడిగా ఉన్నాయి. ప్రస్తుత చలి వాతావరణంలో బావి నీరు వేడిగా ఉండడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భూగర్భజల శాఖ ఉపసంచాలకుడు శ్రీనివాస్‌ను సంప్రదించగా, భూమి లోపల హైడ్రో థర్మల్ ప్రభావంతో బావినీళ్లు వేడిగా ఉంటాయని చెప్పారు.



యువతిని మోసగించిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

ఆసిఫాబాద్: యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పు చెప్పారు. రెబ్బెన సీఐ బుద్దె స్వామి కథనం ప్రకారం.. రెబ్బెన మండలం ఖైర్‌గూడకు చెందిన యువతి తన భర్తతో విడాకులు తీసుకుని కూలీ పని చేసుకుంటూ తల్లి ఇంట్లో ఉంటోంది. ఈక్రమంలో యువతి సోదరుడు తెల్జరి వినోద్‌కుమార్ స్నేహితుడు గోలేటి పంచాయతీ పరిధి దుగ్గపూర్‌కు చెందిన జక్కుల శివకుమార్ యువతి ఇంటికి వెళ్తుండేవాడు. ఈక్రమంలో ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. యువతిని పెళ్లి చేసుకోవాలని కుటుంబసభ్యులు శివకుమార్‌ను అడుగగా నిరాకరించాడు. 2000 సెప్టెంబర్ 17న యువతి రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై దీకొండ రమేశ్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ జగన్మోహన్‌రావు, సీడీవో అండ్ లైజనింగ్ అధికారి ఏఎస్సై పి.రాంసింగ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. నిందితుడు శివకుమార్‌కు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడి తల్లి జక్కుల భాగ్య, తండ్రి గట్టయ్య, చెల్లె బొమ్మకూర్ శిరీషలకు ఒక్కొక్కరికి రూ. 5200 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు రెబ్బెన సీఐ తెలిపారు. నిందితులకు శిక్షపడేలా చేసిన డీఎస్పీ చిత్తరంజన్, సీఐ బుద్దే స్వామి, ఎస్సై చంద్రశేఖర్‌లను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

ఇన్ఫెక్షన్ లేని ఆస్పత్రికి కృషిచేయాలి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌ను ఇన్ఫెక్షన్ లేని ఆస్పత్రిగా తయారు చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ఇటీవల తమిళనాడులోని కోయంబత్తూర్‌లో బయోవేస్టేజ్‌పై శిక్షణకు హాజరుకాగా, మంగళవారం రిమ్స్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్‌లో ఎలాంటి ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బయోవేస్టేజ్‌పై అవగాహన ఉండాలని పేర్కొన్నారు. వ్యర్థాలను వేర్వేరుగా వాటికి సంబంధించిన డబ్బాల్లో మాత్రమే వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్ జాదవ్, పద్మావతి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రైలు కిందపడి ఇద్దరు, మద్యం మత్తులో ఒకరు బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నారు.

రైలు కిందపడి ఒకరు..



గోపాల్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: ఏసీసీ సమీపంలో రైలు కింద పడి ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై మహేందర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నెన్నెల మండల కేంద్రానికి చెందిన గోపాల్(28) తాండూర్ మండలం అచ్చులాపూర్‌కు చెందిన వనితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి జయరాం, కూతురు కార్తీష సంతానం. నెన్నెలలో ఉంటూ గోపాల్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతకొంతకాలంగా భార్యభర్తల మధ్య మనస్పర్ధలతో గొడువలు జరుగుతుండేవి. ఈక్రమంలో గోపాల్ తీవ్ర మనస్తాపం చెందాడు. మంగళవారం ఆటోలో మంచిర్యాల చేరుకుని ఏసీసీ వెనుకాల రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు మృతితో తల్లితండ్రులు ఈగం లక్ష్మి- రమేశ్ కన్నీరుమున్నీరుగా విలపించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో బావిలో దూకి ఒకరు..



శివాజీ (ఫైల్)

తాంసి: మద్యం మత్తులో బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సావర్గాం గ్రామానికి చెందిన మెరుగు శివాజీ(40) వ్యవసాయకూలీగా పని చేస్తూ జీవిస్తున్నాడు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసై పని చేయడం లేదు. సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంటి ముందు ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాధిక అక్కడికి చేరుకుని బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. భార్య భూమిక ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

మందమర్రిలో వ్యక్తి..

మందమర్రిరూరల్: పట్టణంలోని రామన్‌కాలనీ సమీపంలోని రైల్వేట్రాక్‌పై రైలు కిందపడి మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వేహెడ్ కానిస్టేబుల్ కెంసారం సంపత్ ఘటనస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు ఆకుపచ్చ చెక్స్ ఫుల్ షర్ట్, బ్లూ కలర్ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతడి ఛాతీపై రెండు పాత గాయపు మరకలు ఉన్నాయి. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపర్చినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే సెల్ 8328512176 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రమాదాల నివారణ మనందరి బాధ్యత

- ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ ఖుస్రోషాఖాన్



అవార్డులు అందుకున్న ఉద్యోగులతో ఈడీ ఖుస్రోషాఖాన్

మంచిర్యాలఅర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణ మనందరి బాధ్యత అని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ ఖుస్రోషాఖాన్ అన్నారు. మంగళవారం మంచిర్యాల డిపోలో ఆదిలాబాద్ రీజియన్ ప్రగతి చక్ర ప్రదానోత్సవం, ప్రమాద రహిత అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణం పోతే తిరిగిరాదని, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంప్లాయీస్ వెల్ఫేర్ బోర్డు మెంబర్ సత్తయ్య మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో బస్‌స్టేషన్ విస్తరించాలని కోరారు. ఆర్టీసీ కార్మికుల క్వార్టర్లకు మరమ్మతులు, తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు.

ప్రమాదరహిత డ్రైవర్లు

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ రీజియన్ వారీగా ప్రమాద రహిత డ్రైవర్లుగా అన్వర్‌ఖాన్ (ఆసిఫాబాద్), నర్సయ్య (నిర్మల్), యూసుఫ్(మంచిర్యాల) ఈడీ ఖుస్రోషాఖాన్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అదనపు మైలు (ఎక్ట్రా మైలు)కేటగిరీలో సంతోష్(ఆదిలాబాద్), చంద్రయ్య (ఆసిఫాబాద్), గంగాధర్ (భైంసా), గంగాధర్ (నిర్మల్, రాజయ్య(మంచిర్యాల), కంట్రోలర్‌లు దేవేందర్ (ఆసిఫాబాద్), వీబీరావు (ఆసిఫాబాద్), ఉమాకాంత్‌రావు (భైంసా), అంజయ్య (నిర్మల్), ఎంఎం రావు (మంచిర్యాల),సెఫ్టీ వార్డెన్ విభాగంలో విష్ణు (ఆదిలాబాద్), ట్రాఫిక్ సూపర్‌వైజర్ విభాగంలో రాజశేఖర్ (నిర్మల్)అవార్డులు అందుకున్నారు.

ప్రగతి చక్ర అవార్డు గ్రహీతలు వీరే..

డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లు, ఉత్తమ ప్రగతి చూపిన ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు అందజేశారు. డ్రైవర్ విభాగంలో రాజేశ్వర్ (ఆసిఫాబాద్), అసద్దుల్లా(నిర్మల్), రాం శ్రీనివాస్ (మంచిర్యాల), తిరుపతి (మంచిర్యాల), రాజేశ్వర్ (నిర్మల్), కె.శ్రీనివాస్ (మంచిర్యాల), హుస్సేన్‌బిన్ (ఆదిలాబాద్), ఎస్.శ్రీనివాస్ (మంచిర్యాల), ఏఎస్.నారాయణ(నిర్మల్), అత్యుత్తమ ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లు సుభాష్, చంద్రయ్య, విశ్వజిత్, దేవయ్య (ఆసిఫాబాద్), జేఈ సింగ్(ఆదిలాబాద్), మల్లేశ్ (నిర్మల్)ప్రగతి చక్ర అవార్డు అందుకున్నారు. ఎస్‌డీ అలీమ్ (నిర్మల్), రఫీక్ అహ్మద్ (నిర్మల్), దశరథ్ (మంచిర్యాల) ప్రశంసా పత్రాలు అందుకున్నారు. గ్యారేజ్ విభాగంలో శంకర్ (భైంసా, మెకానిక్), రామయ్య (ఎలక్ట్రీషియన్, ఆసిఫాబాద్), సత్యం (హెల్పర్, నిర్మల్), అద్దె బస్సుల విధుల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన డ్రైవర్లు ఎస్‌డీ అలీం (నిర్మల్), రఫీక్ అహ్మద్ (నిర్మల్), దశరథ్ (మంచిర్యాల)కు అవార్డులు అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎం సోలోమాన్, డిప్యూటీ ఆర్ఎం (ఎం) ప్రణయ్, డిప్యూటీ ఆర్ఎం(ఆపరేషన్) ప్రణీత్, డిప్యూటీ ఆర్ఎం వరంగల్ మాధవరావు, మంచిర్యాల డిపో మేనేజర్ జనార్దన్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భైంసా మేనేజర్లు కల్పన, విశ్వనాథ్, హరిప్రసాద్, మంచిర్యాల, నిర్మల్ అసిస్టెంట్ డిపో మేనేజర్లు దేవపాల , రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గుస్సాడీ నృత్యానికి గిన్నిస్ రికార్డు



భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

ఆసిఫాబాద్అర్బన్: తిర్యాణి మండలం దంతన్‌పల్లి భీమయ్యక్ పీవీటీజీ కొలాం గుస్సాడీ బృందం గిన్నిస్‌బుక్ రికార్డు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా బృందం ప్రతినిధి గంగారాం, లక్ష్మణ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గంగారాం, లక్ష్మణ్ మాట్లాడారు. కేంద్రసాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకల కోసం 5వేల మంది నృత్య కళాకారులను ఎంపిక చేయగా ఇందులో 2,800 మంది గిరిజన కళాకారులకు అవకాశం కల్పించారన్నారు. వీరికి నెలపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గణతంత్ర వేడుకల్లో 'జయతి జయమును భారతం' అనే పాట మీద వీరు ఆదివాసీ సంస్కృతిని గుస్సాడీతో నృత్యం ద్వారా తెలిపి గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

తలమడుగు: మండలంలోని ఖోడథ్ గ్రామంలోని అంతర్రాష్ట్ర రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా ఆర్ణీ తాలూకాలోని బాండారి గ్రామానికి చెందిన శంకర్ షిండే ఫంక్షన్ నిమిత్తం జిల్లా కేంద్రానికి సోమవారం బైక్‌పై వచ్చాడు. ఫంక్షన్ అనంతరం మంగళవారం స్వగ్రామానికి తిరుగుపయనయ్యాడు. మహారాష్ట్ర నుంచి వస్తున్న కేటీసీ సిమెంట్ లారీ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఖోడథ్‌లోని మూలమలుపు వద్ద బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన శంకర్ షిండే అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ అతివేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కుటుంబసభుల ఫిర్యాదుతో ఎస్సై అంజమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామస్తుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

ఖోడథ్ గ్రామం మీదుగా అంతర్రాష్ట్ర రహదారి ఉండడంతో కేటీసీ సిమెంట్ లారీల డ్రైవర్లు అతివేగంగా నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. గ్రామంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గంట సేపు రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. ఆదిలాబాద్ సీఐ ఫణిందర్, తలమడుగు ఎస్సై అంజమ్మ, తాంసి ఎస్సై రాధిక అక్కడికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

బైక్ అదుపు తప్పి యువకుడు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ఎల్లంపల్లి వద్ద బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందాడు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్‌కు చెందిన కందుల నాగరాజు ఎన్టీపీసీలో ప్రైవేట్ విధులు నిర్వహిస్తూ స్థానిక ఎల్కపల్లిలో ఉంటున్నాడు. సోమవారం రాత్రి లక్ష్మీపూర్‌కు బైక్‌పై బయల్దేరాడు. ఎల్లంపల్లి కట్ట చివరన గుడిపేట శివారులో మూలమలుపు వద్ద అదుపు తప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.